# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 | హైదరాబాద్, గురువారం 11 జనవరి 2024 | VIKARABAD


## పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

ధారూరు, జనవరి 10: రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలోని వేరుశనగ, వరి నారును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యాసంగిలో సాగు చేసే పంటలు వేరుశనగ, మక్కజొన్న, కూరగాయలు తదితర పంటలను వ్యవసాయ విస్తరణ అధికారులతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సంజువ్‌రాథోడ్, త్రైలోక్య, రైతులు వెంకటయ్య, ఉలేందర్ ఉన్నారు.



రుద్రారం గ్రామంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోపాల్

## మూగజీవాల సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 10 : మూగజీవాల సంరక్షణతో పాటు, వాటి పెంపుకోసం రైతులు పశుసంవర్ధకశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి అంజిలప్ప అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపేట్ గ్రామంలో ఇబ్రహీంపట్నం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు వసంతకుమారి ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజిలప్ప హాజరై రైతులకు పలు రకాల సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎలిమినేడు పశువైద్యాధికారి సురేష్‌బాబు, జిల్లా పశుగ్రామీణాభివృద్ధి సంస్థకు చెందిన అధికారులు కవిత, గోపాలమిత్రులు జగన్, నర్సింహ, పశువైద్య సిబ్బంది సౌమ్య పాల్గొన్నారు.



మూగజీవాల మందులను రైతులకు అందిస్తున్న జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప



గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు



హెచ్‌ఎం అంగూర్‌నాయక్


## ఆరా తీసి.. ఆట కట్టించి

- గంజాయి చాక్లెట్ల గుట్టు రట్టు చేసిన హెచ్‌ఎం
- విద్యార్థులతో సఖ్యత పెంచుకొని ఆరా తీసిన వైనం
- పక్కా ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- హెచ్‌ఎం చొరవతో పట్టుబడిన ముఠా
- వెల్లువెత్తుతున్న ప్రశంసలు

కొత్తూరు, జనవరి 10: విద్యార్థుల విచిత్ర ప్రవర్తనకు కారణం తెలుసుకోవాలని హెడ్ మాస్టర్ చేసిన ప్రయత్నం సఫలమైంది. గంజాయి చాక్లెట్ల ముఠా గుట్టు రట్టయ్యింది. రంగారెడ్డి జిల్లా కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇటీవల విద్యార్థుల ప్రవర్తనలో ఉపాధ్యాయులు మార్పు గమనించారు. పాఠాలు చెబుతుంటే నిద్రపోవడం, ప్రార్థన సమయంలో కింద పడిపోవడం..ఇలాంటి పరిణామాలు గమనించిన హెచ్‌ఎం అంగూర్‌నాయక్ వీటివెనుక కారణాన్ని తెలుసుకోవడానికి యత్నించాడు. అలాంటి విద్యార్థిని గుర్తించి..అతనితో మంచిగా మాట్లాడుతూ, కలిసి భోజనం చేస్తూ వివరాలు సేకరించారు. చాక్లెట్ల విషయం తెలుసుకొని తనకూ అటువంటివి కావాలని తెప్పించుకున్నాడు.. ఏ దుకాణంలో అమ్ముతున్నారో వివరాలు సేకరించి, ఆ షాప్ ఫొటో కూడా తెప్పించుకున్నాడు. ఈ వివరాలన్నింటినీ హెచ్‌ఎం స్థానిక ప్రజాప్రతినిధులతో చెప్పి, అందరూ కలిసి డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. డీఈవో సమాచారంతో పోలీసు ఉన్నతాధికారులు ఎస్‌వోటీ పోలీసులను రంగంలోకి దించారు. వారు మంగళవారం కొత్తూరు మున్సిపాలిటీలోని పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు 8 కిలోల మత్తు చాక్లెట్లను విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అయితే కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను ఆనుకొని ఉన్న దుకాణం నుంచే ఈ మత్తు చాక్లెట్లు సరఫరా జరుగుతుందని పోలీసులు తేల్చారు. మొత్తంగా హెచ్‌ఎం చొరవ కారణంగా ముఠాసభ్యులు అరెస్టుకావడంతో స్థానికుల నుంచి అంగూర్‌నాయక్‌కు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ఐకేపీ కమీషన్ స్వాహా





### వికారాబాద్ జిల్లాలో రూ.10 లక్షలను నొక్కేసిన డీపీఎం

- డీపీఎం భార్య బ్యాంకు ఖాతాలోకి రూ.4.13 లక్షలు,...
- మరో వ్యక్తి ఖాతాలోకి రూ.6 లక్షల కమీషన్ డబ్బులు
- వీబీకే ఖాతా నుంచి కమీషన్ డబ్బులు మళ్లింపు
- గతనెల డీఆర్‌డీవోకు ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం
- ప్రజావాణిలో బూరాన్‌పూర్ ఐకేపీ సభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి..
- విచారణకు ఆదేశించిన కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 10, (నమస్తే తెలంగాణ): ఐకేపీ సభ్యులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకుగాను ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతీ సీజన్‌లో క్వింటాలుకు కొంత కమీషన్ డబ్బులను ఐకేపీ సభ్యులకు ప్రభుత్వం చెల్లిస్తూ వస్తున్నది. ధాన్యాన్ని కొనుగోలు చేసినందుకుగాను ఐకేపీ సభ్యులకు అందాల్సిన కమీషన్ డబ్బులను నొక్కేసిండు ఓ అవినీతి అధికారి. బొంరాస్‌పేట మండలం బూరాన్‌పూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో గత ఐదారేండ్లుగా ధాన్యాన్ని సేకరిస్తున్నారు. ధాన్యాన్ని సేకరించినందుకుగాను సంబంధిత గ్రామ సంఘం బ్యాంకు ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతూ వస్తున్నాయి. సంబంధిత కమీషన్ డబ్బులను ఐకేపీ సభ్యులకు వీవో బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా చేసి అందజేయాల్సి ఉంటుంది. కానీ గ్రామ సంఘం బ్యాంకు ఖాతాలో ఒకేసారి భారీ మొత్తంలో కమీషన్ డబ్బులు ఉండడంతో రూ.10 లక్షలకుపైగా కమీషన్ డబ్బులను నొక్కేశారు. విలేజ్ బుక్ కీపర్‌తో చేతులు కలిపి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వీరయ్య గ్రామ సంఘం బ్యాంకు ఖాతా నుంచి ఐకేపీ సభ్యులకు సమాచారం లేకుండానే మరొకరి ఖాతాకు మళ్లించారు. డీపీఎం వీరయ్య భార్య సుజాత బ్యాంకు ఖాతాలోకి రూ.2 లక్షలు, రూ.2.13 లక్షలను రెండు సార్లు, మరో రూ.6 లక్షలను ముంబైలో ఉంటున్న బిచ్చయ్య బ్యాంకు ఖాతాలో జమ చేశారు. తదనంతరం బిచ్చయ్య ఖాతా నుంచి వీబీకే ఖాతాకు డబ్బులు మళ్లించారు. గ్రామ సంఘం ఖాతాకు సంబంధించి సంబంధిత సంఘం సభ్యులు బ్యాంకుకు వెళ్లగా కమీషన్ డబ్బులు ఖాతా నుంచి మాయమైన విషయం తెలియడంతో బూరాన్‌పూర్ స్వయం సహాయక సంఘాల సభ్యులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గత నెలలోనే డీఆర్‌డీవో కృష్ణన్ దృష్టికి బురాన్‌పూర్ గ్రామ సంఘం సభ్యులు జరిగిన మోసాన్ని తెలుపగా, ఎలాంటి విచారణకు ఆదేశించకపోగా కమీషన్ డబ్బులను నొక్కేసిన అధికారికి మద్దతుగా వ్యవహరించినట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు. నెల రోజులైనా ఎవరూ పట్టించుకోకపోవడంతో గత ప్రజావాణిలో బురాన్‌పూర్ గ్రామ సంఘం సభ్యులు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఐకేపీ సభ్యులకు అందాల్సిన కమీషన్ డబ్బులను నొక్కేసిన ఉదంతంపై పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అదనపు కలెక్టర్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు.

### బుక్ కీపర్ ఏ సమాచారం ఇవ్వడం లేదు



గ్రామ సంఘానికి సంబంధించిన ఏ సమాచారాన్ని అడిగినా బుక్ కీపర్ మహిళలకు ఇవ్వడం లేదు. ధాన్యం కమీషన్ ఎంత వచ్చింది, డబ్బులు ఎక్కడ ఉన్నాయని అడిగితే తెలుపలేదు. కమీషన్ డబ్బులు దుర్వినియోగం అయ్యాయని తెలుసుకుని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలి.

**-మాటూరి పద్మమ్మ, మహిళా సంఘం సభ్యురాలు, బురాన్‌పూర్**

### లెక్కలు తేల్చాలని చెప్పినా రావడం లేదు..



ధాన్యం కొనుగోలు చేపట్టగా గ్రామ సంఘానికి వచ్చిన కమీషన్ డబ్బుల గురించి బుక్ కీపర్, ఓబీలను అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదు. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. వచ్చిన కమీషన్ డబ్బులు ఎక్కడున్నాయో లెక్కలు చేద్దాం రండి అని బుక్ కీపర్‌ను, ఓబీలను పిలిస్తే రావడం లేదు. ఓబీలు, బుక్ కీపర్ కలిసి కమీషన్ డబ్బులను దుర్వినియోగం చేశారు. ఉన్నతాధికారులు ఈ విషయమై విచారణ చేయాలి.

**-కిష్టపురం సత్యమ్మ, సంఘం సభ్యురాలు, బురాన్‌పూర్**



మండలం, మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శుల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి..

## కాంగ్రెస్ హామీలపై ప్రజలను చైతన్యం చేయాలి

### జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, జనవరి 10 : శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్‌పార్టీ కాలయాపన చేయడానికి ప్రయత్నిస్తున్నదని బీఆర్‌ఎస్ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలాలు, మున్సిపాలిటీల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులతో ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు దరఖాస్తులు, ఇంటింటి సర్వేల పేరిట కాలం వెళ్లదీయటానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై భ్రమలు తొలిగిపోతున్నాయని, అబద్దాల మీద ఎల్లకాలం గడపడం కాంగ్రెస్‌పార్టీకి సాధ్యం కాదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకులు తాళ్ల మహేశ్‌గౌడ్, మండలపార్టీ అధ్యక్షులు బుగ్గరాములు, రమేష్‌గౌడ్, రమేష్, దామోదర్, మున్సిపల్ అధ్యక్షుడు జంగయ్య, కిషన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, పాశ్చబాష, బహదూర్, పొట్టి శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి, పరుశురాం, నాయకులు జెర్కోని రాజు, నిట్టు జగదీశ్వర్, బాలకృష్ణగౌడ్ తదితరులున్నారు.



నూతన భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ యాదగిరి

## త్వరలో అందుబాటులోకి డిగ్రీ కాలేజీ భవనం

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్ యాదగిరి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 10 : ఇబ్రహీంపట్నం సమీపంలో నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి కృషిచేస్తామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్ యాదగిరి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో వసతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. అనంతరం ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్‌లో కొనసాగుతున్న నూతన డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వీలైనంత తొందరగా భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సహకరించాలని ఇంజనీర్‌తో పాటు కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. అవసరమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

### జిల్లా నలుమూలల నుంచి 321 నమూనాల ప్రదర్శనలు

ఇబ్రహీంపట్నం, జనవరి 10: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠం పాఠశాలలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ ప్రదర్శనలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు తయారుచేసిన 321 ప్రయోగాలను ప్రదర్శించారు. మంగళ, బుధవారాల్లో జరిగిన ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో సుమారు 2 వేలమందికిపైగా విద్యార్థిని, విద్యార్థులు తిలకించారు. దీంతో గత రెండ్రోజులుగా గురుకుల విద్యాపీఠం పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఈ ప్రదర్శనకు జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన సక్సెస్‌ఫుల్ అయ్యింది. విద్యార్థిని, విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించడంతోపాటు సమాజానికి ఉపయోగపడే ఎన్నో ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భావి సైంటిస్టులుగా మార్చేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రదర్శనకు గత రెండ్రోజులుగా విచ్చేసిన విద్యార్థిని, విద్యార్థులకు గురుకుల విద్యాపీఠంలో అన్ని ఏర్పాట్లు చేశారు.



నమూనాను ప్రదర్శిస్తున్న ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల

**ప్రారంభించిన ఎమ్మెల్యే.. ముగించిన కలెక్టర్**

ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనిత, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ శశాంక పాల్గొన్నారు. రెండ్రోజుల పాటు విద్యార్థిని, విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రయోగాలను పలువురు సైంటిస్టుల బృందం పరిశీలించింది. అనంతరం సమాజానికి ఉపయోగపడే శాస్త్రీయ నైపుణ్యం కలిగిన ప్రదర్శనలను ఎంపిక చేసి, బహుమతులు కూడా అందజేశారు.

**ప్రదర్శనలో 321 ప్రయోగాలు**

రెండ్రోజులపాటు గురుకుల విద్యాపీఠంలో 321 ప్రయోగాలను ప్రదర్శించారు. ప్రదర్శనలో 41 జిల్లా పరిషత్ స్కూళ్లు పాల్గొనగా.. 155 ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. 9 మండల పరిషత్ పాఠశాలలు.. 29 ప్రదర్శనలు ఏర్పాటుచేశాయి. 2 గురుకుల పాఠశాలలు పాల్గొనగా.. 4 ప్రదర్శనలు ఏర్పాటుచేశాయి. 2 కేజీబీవీలు పాల్గొని 3 ప్రదర్శనలు ఏర్పాటుచేశాయి. 25 ప్రైవేటు పాఠశాలలు పాల్గొనగా.. 89 ప్రయోగాలను ప్రదర్శించారు. మొత్తంగా 79 పాఠశాలలకుగాను 280 ప్రయోగాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయుల నుంచి 3 ప్రదర్శనలు, సెమినార్‌ల నుంచి 38 ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. మొత్తం 321 ప్రయోగాలను ప్రదర్శించారు.

### సృజనాత్మకతకు ప్రతిరూపం..

**ముగింపు కార్యక్రమంలో డీఈవో సుశీందర్‌రావు**

విద్యార్థుల్లో సృజనాత్మకత, మేధాశక్తికి ప్రతిరూపమే ఈ వైజ్ఞానిక ప్రదర్శనలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రాజీరెడ్డి, డీసీఈబీ సెక్రటరీ రామచంద్రారెడ్డి, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, కృష్ణ. విద్యార్థులు పాల్గొన్నారు.

**విజేతలకు బహుమతుల ప్రదానం**

అనంతరం ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలుగా ఎంపికైన వారిలో లాట్స్ హైస్కూల్ విద్యార్థులు యశస్వినిరెడ్డి, అశోక్‌కుమార్, పాలమాకులలోని మైనార్టీ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు కిరణ్, అక్బర్‌ఖాన్, కుర్మిద్ద జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు చరణ్‌తేజ, పాండురంగారెడ్డి, చంపాపేట్ హైస్కూల్ విద్యార్థులు అక్షరరెడ్డి, సౌజన్య, చేవెళ్లలోని టీఎస్‌ఎంఎస్ విద్యార్థులు సాయిగాయత్రి, సుజాత, ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠం హైస్కూల్ విద్యార్థి అక్షయ దీపక్‌కుమార్, హయత్‌నగర్‌లోని జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు శివచరణ్, భాస్కర్, అహ్మదాపూర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు శ్రీనిధి, నాగేశ్‌బాబు, ఇబ్రహీంపట్నం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు నిఖిత, ఉమాదేవి ఉన్నారు.

### ప్రదర్శనలతో విజ్ఞానం



వైజ్ఞానిక ప్రదర్శనలతో విజ్ఞానం పెరుగుతుంది. ఇలాంటి జిల్లా స్థాయి ప్రదర్శనలతో మా లాంటి విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటపడుతుంది. కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి పెరగడంతోపాటు అన్ని రంగాల్లో రాణించేందుకు వీలుంటుంది.

**- మనీశ్, టీఎస్ఎంఎస్, పాలమాకుల**



మాట్లాడుతున్న డీఈవో సుశిందర్‌రావు

### ప్రతి పాఠశాలలో ప్రయోగశాల ఏర్పాటు చేయాలి



శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రతి పాఠశాలలో ఓ ప్రయోగశాలను ఏర్పాటుచేయాలి. వీటితో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యత వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నది. ఇలాంటి ప్రదర్శనా క్షేత్రాల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది.

**- పవన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇబ్రహీంపట్నం**

### సద్వినియోగం చేసుకున్నాం



జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఏర్పాటుచేసిన ప్రదర్శనలను సద్వినియోగం చేసుకున్నాం. వీటిలో అనేక రకాల విషయాలు తెలుసుకున్నాం. ప్రదర్శనా క్షేత్రాలు నాలాంటి ఎంతోమందికి ఉపయోగకరంగా ఉంటాయి. నియోజకవర్గ స్థాయిలోనూ ఏర్పాటు చేయాలి

**- యశస్విని, బాలికల ఉన్నత పాఠశాల, రాగన్నగూడ**



నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టును పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

## అల్లం వెల్లుల్లి లేకుండానే.. పేస్ట్ తయారీ

- నకిలీ ఉత్పత్తుల తయారీదారుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 10 : అల్లం వెల్లుల్లి లేకుండానే.. నకిలీ పేస్ట్ తయారు చేసి మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయిస్తున్న తయారీదారులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశామని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. బుధవారం వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. వికారాబాద్ పట్టణంలో బుధవారం నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయించేందుకు తీసుకొచ్చారని సమాచారం వచ్చింది. వెంటనే జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం ఇన్‌చార్జి ఎస్సై ప్రశాంత్‌వర్ధన్, పట్టణ సీఐ శ్రీను సిబ్బందితో కలిసి డైమండ్ హోటల్ దగ్గర వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఒక ట్రాలీలో ఓ వ్యక్తి తీసుకొస్తున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కాటన్‌లను గుర్తించారు. ఆ వ్యక్తిని విచారించగా హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో తయారు చేసిన కల్తీ అల్లం వెల్లుల్లిని కొని ఇక్కడ విక్రయించేందుకు తీసుకొచ్చానని తెలిపారు. 5 కేజీల అల్లం వెల్లుల్లి పేస్ట్ డబ్బాను రూ.200 విక్రయిస్తున్నట్లు తెలిపారు. వెల్లుల్లి పొట్టు, యాసిడ్స్, కెమికల్స్ వాడి అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో తనిఖీ చేసి మరో వ్యక్తి నుంచి కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ఉన్న 30 కాటన్లు, 30 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్ కలిగిన నాలుగు చిన్న డ్రమ్ములు, కెమికల్స్, యాసిడ్స్ స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వికారాబాద్ టౌన్ సీఐ శీను, టాస్క్‌ఫోర్స్ ఎస్సై ప్రశాంత్‌వర్ధన్ ఉన్నారు.